AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం..

2



2

అమ్మకు భక్తితో పూజలు..

జిల్లావాసికి ఏరువాక ఫౌండేషన్ అవార్డు

అక్షరటుడే, ఇందూరు: జిల్లా కేంద్రంలోని పద్మా నగర్‌కు చెందిన డాక్టర్ సింగం సుస్మిత ఏపీలోని ఏరువాక ఫౌండేషన్ వార్షిక అవార్డు అందుకుంది. ఉత్తమ సృజనాత్మక ఆలోచన విభాగం-2024 అవార్డుకు గాను ఆమెను ఎంపిక చేశారు. పద్మా నగర్‌కు చెందిన లావణ్య, పోశెట్టి దంపతుల కూతురు డాక్టర్ సుష్మిత పశ్చిమ బెంగాల్‌లోని బీదాన్ చంద్ర విశ్వవిద్యాలయంలో వ్యవసాయ కీటక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ఆమెకు అవార్డు రావడంపై ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద..

అక్షరటుడే, మెండోరా : శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. దీంతో అధికారులు 39 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 2,61,263 క్యూసెక్కుల వరద వస్తోంది. గత నాలుగైదు రోజులుగా వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వను తగ్గించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం.. 1,086 అడుగుల (63.93 టీఎంసీలు) నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా 2.50 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. వరద కాలువకు 2 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5,500, సరస్వతి కాలువకు 400, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. 632 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది. మొత్తం 2,61,263 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది.

హక్కులు సాధించాలంటే పోరాటాలే మార్గం: కూనంనేని

అక్షరటుడే, ఇందూరు : హక్కులు సాధించాలంటే పోరాటాలు ఒకటే మార్గమని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర హాల్‌లో శనివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోరాటాల వల్లే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. హమాలీలకు సమగ్ర చట్టం రావాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలతోనే ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎర్రజెండా సత్తా చాటాలన్నారు. కమ్యూనిస్టులు భారతంలో కృష్ణుడు లాంటి వారని, తాము ఏ వైపు ఉంటే ఆ వైపు బలం ఉంటుందని పేర్కొన్నారు. స్వార్థం లేని సిద్ధాంతాలు గల పార్టీ సీపీఐ అని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు చేసే పోరాటం రాహుల్ గాంధీ కూడా చేస్తున్నారని, బీజేపీ చేస్తున్న అన్యాయాలను బయటకు తీసుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూలీ రేట్లు ఒకే విధంగా ఉండాలని, కార్మికుల వయసు 58 నుంచి 65 వరకు పెంచాలని, ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. బీజేపీది అత్యంత ప్రమాదకరమైన సిద్ధాంతమని, మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తుందని విమర్శించారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని కార్మికులకు అండగా ఉంటుందన్నారు. పదేళ్లుగా మార్కెట్ యార్డు ఉందా లేదా అనే సందేహం కలిగిందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, సీపీఐ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి ప్రవీణ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. నాలాలను కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. నగరపాలక సంస్థ పరిధిలో వర్షం కురిస్తే చాలు లోతట్టు కాలనీలతో పాటు ప్రధాన రహదారులు కూడా జలమయం అవుతున్నాయి. దీంతో నగరవాసులు అనేక ఇబ్బందు లు పడుతున్నారు. అయితే నాలాల ఆక్రమణలతోనే వరదనీరు కాలనీల్లోకి వస్తోంది.

- అక్షరటుడే, ఇందూరు

యథేచ్ఛగా ఆక్రమణలు

▸ నాలాలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు ▸ పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. ఇందులో సుమారు రెండు లక్షల కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే పలు కాలనీలో మురుగు కాలువలు, నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. పైనుంచి స్లాబులు వేయడంతో నీటి ప్రవాహ ఒత్తిడికి వరద నీరు వీధుల్లోకి వస్తోం ది. అసంపూర్తి కాలువల నిర్మాణంతో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఏటా వర్షాకాలంలో సమస్యలు వస్తే సహాయక చర్యలు చేపడుతున్నారు. కానీ వానాకాలం ముగిశాక ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి మరోసారి ఆ పరిస్థితి తలెత్తకుండా శాశ్వత చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ ప్రాంతాల్లో అధికం..

నగరంలోని ఖలీల్‌వాడి, ఆటోనగర్, శాంతినగర్, ఆటోనగర్, అహ్మద్‌పూర కాలనీ, బోధన్ రోడ్డు, స్ట్రామ్ చంద్రశేఖర్ కాలనీ, హైదరాబాద్ రోడ్డు, వినాయక్ నగర్, గౌతమ్ నగర్ తదితర కాలనీలో మురుగు కాలువలపై ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొన్ని శివారు ప్రాంతాల్లో, నూతన కాలనీలో ఇప్పటికీ మురుగు కాలువలే లేవు. అప్పట్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టిన పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటికీ కొన్ని కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం కూడా కాలేదు. దీంతో వరద నీరు వెళ్లే మార్గం లేక కాలనీల్లోకి వస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టి..

నగరంలో ఆక్రమణలపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో తరచూ సమావేశం నిర్వహిస్తూ బాధ్యతాయుతమైన విధులు నిర్వహించాలని హెచ్చరిస్తున్నారు. దీంతో రెండు రోజుల క్రితం నగరంలోని నాగారం డీఎస్ కాలనీలో నాలాపై నిర్మించిన అక్రమణలను తొలగించారు. అయితే నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చెప్తే కానీ తొలగించే పరిస్థితి లేదు. ప్రధానంగా ఖలీల్ వాడి, బోధన్ రోడ్డు, వినాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో నాలాలపై అనేక ఆక్రమణలు ఉన్నాయి. వాటిని గుర్తించి తొలగించాల్సిన అవసరం ఉంది.

సమన్వయం అవసరం..

వర్షం పడితే హైదరాబాద్ తరహాలో నగరంలోని భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ప్రధాన రహదారులపై వరద నీరు నిలవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ట్రాఫిక్ పోలీసులు, నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో నాలాలపై ఆక్రమణలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ప్రధాన ప్రాంతాల్లో వన్‌వే ఏర్పాటు చేశారు అయితే అది శాశ్వతంగా ఉండేలా చూస్తే ట్రాఫిక్ అంతరాయానికి చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

కుక్కలు బాబోయ్ కుక్కలు..

నగరంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరిపై దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నగరంలోని అనేక కాలనీల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను కరుస్తున్నాయి. కుక్కలతో గాయాలపాలైన వారు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బోర్గాం (పి)లోని సంజీవ్‌రెడ్డి కాలనీలో ఇలా గుంపులుగా తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల నివారణకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– అక్షరటుడే, ఇందూరు

స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు

అక్షరటుడే, ఇందూరు: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లపై ప్రభుత్వ కసరత్తు కొలిక్కివచ్చింది. జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లపై ఉత్కంఠతో ఎదురుచూస్తున్న రాజకీయ పార్టీ నాయకులకు ఊరట లభించింది. జిల్లాలోని 31 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు శనివారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సమక్షంలో ఖరారు చేశారు. ఇందులో మూడు ఎస్టీలకు, 5 ఎస్సీలకు, 10 జనరల్, 13 బీసీలకు కేటాయించారు.

31 మండలాలకు సంబంధించి..

జిల్లాలో గతంలో 27 మండలాలు ఉండగా కొత్తగా ఆలూరు, డొంకేశ్వర్, సాలూర, పోతంగల్ నాలుగు మండలాలు ఏర్పడ్డాయి. దీంతో 31 మండలాలు ఉన్నాయి. కాగా.. మొత్తం 8,51,417 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,96,778 మంది, మహిళలు 4,54,621 మంది ఉన్నారు.

తొలి ప్రయత్నంలోనే సావెల్ వాసికి గ్రూప్–1 ఉద్యోగం

అక్షరటుడే, మెండోరా: మండలానికి చెందిన దోనుపాల కిరణ్ మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నాడు.

అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా..

దోనుపాల కిరణ్ గ్రూప్-1లో మొదటి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రణాళికాబద్ధంగా.. సీనియర్ల సలహాలతో సమయపాలన పాటిస్తూ చదివినందుకే తాను మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, బంధువులు స్నేహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ గ్రామస్థుడు గ్రూప్-1 అధికారిగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటీసీలతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు

అక్షరటుడే, ఇందూరు : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా విరివిగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో అందుబాటులోకి తెచ్చిన 65 సెంటర్లను శనివారం మంత్రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌లో గల ఐటీఐలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఏటీసీ కేంద్రాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సరికొత్త సాంకేతికత అంశాలతో యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పంతో ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో బోధన్ కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ నిజామాబాద్‌లో 5 సెంటర్లు కామారెడ్డిలో 4 సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఒక్కో ఏటీసీ కేంద్రానికి రూ.4.70 కోట్ల నిధులను ఖర్చు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ప్రిన్సిపాల్ యాదగిరి, ఇన్‌స్ట్రక్టర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం..: హైకోర్టు న్యాయమూర్తి

అక్షరటుడే, కామారెడ్డి : రక్తదానం ప్రాణదానంతో సమానమని హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నర్సింగ్ రావు అన్నారు. జిల్లాకోర్టు ఆవరణలో శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరం లో పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ.. రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణం కాపాడే అవకాశం ఉందని తెలిపారు. రక్తదానం ప్రాణాలను కాపాడే పుణ్యకార్యమని, ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు ఇది ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. అనంతరం కోర్టు భవనాన్ని సందర్శించి, కామారెడ్డి జిల్లా కోర్టుకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు రామారెడ్డి ఇసన్నపల్లి శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కామారెడ్డి కార్యదర్శి నాగరాణి, కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి సూర సుమలత, ప్రథమ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బిచ్కుంద జూనియర్ సివిల్ జడ్జి వినీల్ కుమార్, ఎల్లారెడ్డి న్యాయమూర్తి సుష్మ, బాన్సువాడ న్యాయమూర్తి భార్గవి, డీఎఫ్‌వో నిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

అక్షరటుడే, ఇందూరు : దివంగత మాజీమంత్రి డి.శ్రీనివాస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. డీఎస్ జయంతి సందర్భంగా నగరంలోని బైపాస్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి డీఎస్ ఎంతో కృషి చేశారన్నారు. పేదల కోసం నిరంతరం పాటుపడేవాడని, ఎందరికో రాజకీయ భిక్ష పెట్టిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో జిల్లా పేరును నిలబెట్టారని గుర్తు చేశారు. బ్యాంకు ఉద్యోగి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఆదర్శంగా నిలిచారన్నారు. రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. అప్పట్లో రాష్ట్రపతి ప్రధాని కేంద్ర మంత్రులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తి అని తెలిపారు. డీఎస్ అభిమానులుగా తాము ఎప్పటికీ గుర్తు చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, మాజీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి వైద్య ఖర్చులు చెల్లించాలి

అక్షరటుడే, ఇందూరు: నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ వాటర్ ట్యాంక్ పైనుంచి పడి కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఆస్పత్రిలో చేరిన ఔట్‌సోర్సింగ్ కార్మికుడు మధును బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుడికి సంబంధించి పూర్తి వైద్యఖర్చులను సంబంధిత ఏజెన్సీ సంస్థనే భరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి గంగా శంకర్, వాటర్ సెక్షన్ యూనియన్ అధ్యక్షుడు రాహుల్, నాయకులు శ్రీశైలం, వసంత్ జాదవ్, కిరణ్, రాజేందర్, లైన్మెన్లు మోహన్, గంగారాం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అక్షర టుడే, ఇందల్వాయి: ఇందల్వాయి మండల రజక సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో వివిధ గ్రామాల రజక సంఘం సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రాయనపల్లికి చెందిన శ్రీపతి దత్తు, ప్రధాన కార్యదర్శిగా గన్నారం గ్రామానికి చెందిన ప్రదీప్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రజక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలతో సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాలకు చెందిన రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్ల కోసం డ్రా

అక్షరటుడే, ఇందల్వాయి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కోసం డ్రా నిర్వహించారు. ఎంపీడీవో అనంతరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వార్డుల రిజర్వేషన్లను డ్రా సిస్టం ద్వారా ఎంపిక చేశారు. ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినందున రిజర్వేషన్లు ఖరారు చేస్తున్నట్లు వివరించారు. ఈ రిజర్వేషన్ల ఎంపిక ప్రక్రియలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, తహశీల్దార్ వెంకటరావు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో..

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..

తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి..

బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఈ వేడుకలో ఆడపడుచులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. యువతులు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తీరొక్కపూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వాటినన్నింటిని ఒకచోట పేర్చి ఆడిపాడుతున్నారు. సందడి చేస్తున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్

భీమ్‌గల్ మండల కేంద్రంలో..

హైవేపై రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం

అక్షరటుడే, ఇందల్వాయి: హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. తన ముందు వెళ్తున్న భారీ వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. దగ్గి వద్ద ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మంజూర్ హుస్సేన్(47) వృత్తిరీత్యా మార్కెటింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా.. అతను శనివారం తెల్లవారు జామున బైకుపై 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దగ్గి సమీపంలో ప్రమాదవశాత్తు ముందువెళ్తున్న భారీ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కామారెడ్డి జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రికి తరలించారు. సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో..

కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం.. స్ఫూర్తిదాయకం..



జీసీటీయూ ఆధ్వర్యంలో..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. తొలి,మలిదశ ఉద్యమాల్లో ఆయన పోరాటం చిరస్మరణీయమని వారు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఉమ్మడిజిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు.. చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్

బాన్సువాడ మండల కేంద్రంలో..

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..

జీజీహెచ్‌లో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో..

జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

వార్డు సభ్యులకు రిజర్వేషన్లు కేటాయింపు

అక్షరటుడే, భీమ్ గల్: మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 244 వార్డులకు రిజర్వేషన్లు కేటాయించినట్లు తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీఓ సంతోష్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, జనరల్ స్థానాల్లో మహిళ రిజర్వేషన్ల కోసం ఒక్కో కేటగిరిలో 50శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కే వాక్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కే వాక్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ఆస్పత్రి వైద్యులు సదానంద రెడ్డి, సందీప్ రావు, రవికిరణ్, జగదీష్ చంద్రబోస్, వరిస్ అలీ వివరాలు వెల్లడించారు. నగరంలో 2కే వాక్‌ను రుక్మిణి ఛాంబర్స్ వినాయక్ నగర్ నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు డీసీపీ బస్వారెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు. నేటి సమాజంలో గుండె జబ్బులు క్రమక్రమంగా పెరుగుతున్నాయని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల ఆహారం, ఆరోగ్య పరీక్షల ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సాధారణంగా రూ.5,000 విలువైన కార్డియాలజీ ప్యాకేజీని కేవలం రూ.999కే అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఈ ప్యాకేజీని వినియోగించుకోవాలన్నారు.

బస్సు ప్రయాణికులకు లక్కీడ్రా బాక్సుల ఏర్పాటు

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి బస్టాండ్ నుంచి ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేసినట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్ తెలిపారు. నేటి నుంచి వచ్చేనెల 6 వరకు సెమీ డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ, అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు తమ టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబరు రాసి కామారెడ్డి బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సుల్లో వేయాలని సూచించారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ప్రయాణికులకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడుగుకో గుంత.. తీరేనా చింత..

జిల్లాలోని పలు రహదారులు అధ్వానంగా మారడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. నగర శివారులోని నాగారం నుంచి కొత్తపేట్ వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతల కారణంగా వాహనాలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. –అక్షరటుడే, వర్ని

మహిళలు ఆర్థిక వృద్ధి సాధించాలి

అక్షరటుడే, బీర్కూర్: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితలే రమేష్ అన్నారు. బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ క్లబ్ భవనంలో బీర్కూర్‌కు చెందిన విజయలక్ష్మికి ఉచిత కుట్టుమిషన్ అందజేశారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలతో సమాజానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ మేకల గాలయ్య, జోన్ ఛైర్మన్ కోట్టురి సంతోష్, సీనియర్ సభ్యులు ప్రభుదాస్ కిషోర్, మేకల విఠల్, కందకుర్తి సంతోష్, లయన్స్ సభ్యులు కిరణ్ దుబాయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు

అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ మున్సిపల్ కార్మికులకు దసరా బతుకమ్మ, పండుగల నేపథ్యంలో ముందుగానే జీతాలు చెల్లించినట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. కార్మికుల అభ్యర్థన మేరకు మూడు రోజుల ముందుగానే జీతాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఓంకార్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ హరినామ సప్తాహం

అక్షరటుడే, కోటగిరి : పోతంగల్‌లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బస్టాండ్ ఆవరణలో శ్రీ స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గాదేవి మండపంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభించారు. హనుమంత్‌రావు బాపురావ్ జోషి ఆధ్వర్యంలో శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



నగరంలోని ఖిల్లా రోడ్ మమ్మదేవి ఆలయంలో..

ఆర్మూర్‌లో..

నగరంలో గాజుల్ పేట్ యూత్ ఆధ్వర్యంలో..

అమ్మకు భక్తితో పూజలు..

శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజు అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలా డుతున్నాయి. భక్తులు ఆలయాలను దర్శించి మొక్కులు తీర్చుకుంటున్నారు. అలాగే దుర్గామాత మండపాల వద్ద అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి భక్తితో కొలుస్తున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్

అన్నదానంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

యాదగిరి బాగ్‌లో..